# మదిలో దీపం వెలిగించు

- జొన్నలగడ్డ శ్యామల, హైదరాబాదు

సమయం ఆరున్నరయింది. వేసవి కావటం వల్ల కాబోలు ఇంకా వెలుగుగానే ఉంది. ట్యాంక్ బండ్ బస్టాప్‌లో నిలుచున్న నాకు ఎదురుగా అస్తమిస్తున్న ఎర్రని సూర్యబింబం.... నీలం, తెలుపు, లేత ఎరుపు, లేత గోధుమ, గచ్చకాయ రంగుల్లో ఆకాశం అందాలను ఆరబోస్తుంటే, దాని అందాన్ని ఇనుమడింపజేస్తూ సాటిలేని కళాఖండంలా వెలిగిపోతున్న సూర్యుడు. విచిత్ర ఆకారాల్లో గోచరిస్తూ షికార్లు చేస్తున్న మబ్బుల గుంపులు. ఎంత చూసినా కంటికి అలుపూ లేదు, మనసుకు తృప్తీ లేదు. సూర్యుడు ఓ పెద్ద నక్షత్రమని సైన్స్ చెప్పవచ్చుగాక, ప్రపంచమంతటికీ వెలుగునిచ్చే దినకరుడు, ప్రత్యక్షదైవమే. ఆరోగ్యానిచ్చే దైవమనే సూర్యనారాయణమూర్తికి అరసవిల్లిలోను, కోణార్క్‌లోనూ ఆలయాలే నిర్మించారు. సూర్యుడి వల్లనే ప్రకృతి సిద్ధంగా మనకు 'డి' విటమిన్ సమకూరుతోంది.

వెలుగుల్లోనూ ఎంతో వైవిధ్యం ఉంది. చీకట్లు తొలిగిపోతు అప్పుడప్పుడే ప్రవేశించే వేకువ వెలుగు, ప్రచండంగా తోచే మధ్యాహ్నపు వెలుగు, సూర్యుడు మరలిపోతూ, చీకట్లు తొంగిచూస్తూ ప్రత్యేకంగా కనిపించే సంజె వెలుగు, ఆపైన చందురుని చల్లని కిరణాల వెన్నెల వెలుగు.

ఇంతలో బస్ వచ్చేసింది. చూపు మరల్చి, అలవాటుగా ఎక్కి కూర్చున్నానే కానీ మనసంతా వెలుగుల ఆలోచనే చిక్కబడుతోంది. కొత్తగా సొంతిల్లు కట్టుకున్న రోజుల్లో ఉత్సాహంగా పెంచిన తోటలో పచార్లు చేస్తుంటే ఆకుల సందుల్లోంచి పడే సూర్యకాంతి చిత్రంగా తోచేది. ఇప్పుడా తోటే కనుమరుగయింది. ఉదయం వేళల్లో తలుపు సందుల్లోంచి, కిటికీలలోంచి పడే అరుణకిరణాల అలవోక అందం తీరే వేరు.

సూరీడు వెలుగుతో హలో చెప్పగానే సరోజం అందంగా విరిసి అభివాదం చేస్తుంది. సూరీడుని నమ్మరాదని లెక్సింగ్‌టన్‌కు వెళ్ళినప్పుడు మొదటిసారిగా అనుకున్నాను. సూరీడొచ్చాడు అన్న ధీమాతో ఉన్నపాటున వాకిట్లో అడుగుపెట్టానో లేదో, చల్లగాలి షాకిచ్చి ఇంట్లోకి తరిమింది. ఆ సూర్యుడికి వెలుగే కానీ వేడిమి లేదని అర్థమయింది.

అంతలో చిన్నప్పుడు తిరుపతిలో దక్షిణమాడ వీధిలో ఉండే రోజులు గుర్తుకొచ్చాయి. రాత్రుళ్ళు మేడమీద పడుకుని చూపు సారిస్తే, పున్నమి వెన్నెల వెలుగుతో పోటీపడుతూ తిరుమల దారిన వెలిగే ట్యూబులైట్ల వెలుగే వెలుగు.

అంతలోనే చాల ఏళ్ళ క్రితం కొలీగ్స్‌తో వెళ్ళిన శ్రీశైల విహారయాత్ర స్మృతి పథంలో మెదిలింది. ఆరోజు రాత్రి పదిన్నరకు వేన్‌లో బయలుదేరారు. తోవ పొడుగుతా పుచ్చపువ్వులా వెన్నెల. శరత్ చంద్రికల ఆహ్లాదం ఓవైపు, స్నేహితుల సరదా కబుర్లు, పాటల కోలాహలం మరోవైపు. మధ్యలో ఓ నీటిపాయలో వెన్నెల కాంతికి మురిసి, కమనీయంగా విచ్చుకున్న కలువలు... ఆనాటి వెన్నెల ఇప్పటికీ మదిలో తాజాగా మిగిలే ఉంది.

అసలు ఆరుబయట పడక్కుర్చీలో విశ్రాంతిగా కూర్చుని కొబ్బరిచెట్ల ఆకుల సందుల్లోంచి పడే వెన్నెల సోయగాన్ని ఆస్వాదించి ఎన్ని రోజులయింది? ఎన్నింటినో సాధించిన మనిషి తన మేధతో కృత్రిమ వెలుగునూ సాధించాడు. థామస్ ఆల్వా ఎడిసన్‌గారు ఎన్ని సార్లు విఫలమయినా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి ఎలక్ట్రిక్ బల్బ్‌ను ఆవిష్కరించి మానవాళికి మహోపకారం చేశాడు. ఆయన కృషి ఫలితంగానే నేడు మనం ఎన్నెన్నో విద్యుద్దీపకాంతులతో రాత్రిని సైతం పగలులా చేసుకోగలుగుతున్నాం.

అంతలో ఆమధ్య సందర్శించిన బొర్రా గుహల్లో దీపకాంతులు కళ్ళముందు నిలిచాయి. ఎరుపు, కాషాయవర్ణాలతో నిండిన కాంతులతో బొర్రాగుహలు ఔరా అనిపించాయి. అంతేనా, తిరుపతి యాత్రలో చంద్రగిరి కోటను సందర్శించినప్పుడో....లైట్ అండ్ మ్యూజిక్ షో ఎంత బాగుందీ!

వెన్నెల్లో సముద్రుడి అందానికి అవధులుండవు. పగటి సముద్రుడుకీ, రాత్రి సముద్రిడికీ ఎంతో తేడా...చూసి తీరాల్సిందే.

చిమ్మ చీకట్లో చిన్న కొవ్వొత్తి వెలిగించినా సరే. కొవ్వొత్తిదే పైచేయి. వెలుగు శక్తి అది. విద్యుత్తు కనుగొనని రోజుల్లో చదువయినా, పనులయినా చిమ్నీల వెలుగుల్లోనే. విద్యుత్తు ఉన్నా, ఇప్పటికీ దానికి నోచని పల్లెల్లో లాంతర్లే వారికి గత్యంతరాలు. వీధి దీపాల వెలుగుల్లోనే చదువుకొని, తాము వెలిగి, ప్రపంచానికే వెలుగులు పంచిన మహనీయులెందరో ఉన్నారు.

అసలు వెలుగుల పండగ దీపావళి మాటో....దీపావళి నాటి రాత్రి ప్రమిదల్లో వెలిగించే దీపాల వరుసల అందమే అందం. ఇటీవలి కాలంలో పట్నాల్లో దీపావళికి విద్యుత్ బల్బులను వెలిగిస్తున్నారు. ఏ దీపకాంతిఅ దీపానిదే. అమావాస్య చీకట్లను పారదోలుతూ లోకాన్ని కాంతిమయం చేసే పండగది. మరోవైపు చిచ్చుబుడ్లు, భూచక్రాలు, విష్ణుచక్రాలు, కాకరపువ్వొత్తులు వెలుగుతూ మిడిసిపడుతుంటాయి. అసలు ఇంత వెలుగును గుర్తించగలుగుతోంది కన్నులుండటం వల్లనే.

అందుకే 'పంచేంద్రియాణాం నయనం ప్రధానం' అన్నారు. ఆపైన తల్లితండ్రులు భావుకతతో పిల్లలను కంటివెలుగుగా చెప్పుకోవటం సహజమే.

ఏ వ్యక్తి ముఖానికి అయినా సరే నవ్వే పెద్ద వెలుగు. పెదాలే దానికి రిమోట్. చాలామంది ఆ రిమోట్‌ను కావాలని నొక్కేస్తూ నవ్వును అదుపు చేస్తుంటారు. అధికంగా కనిపించేవి అర,కొర నవ్వులే. అయితే ఏ వ్యక్తికయినా సంతోషం కలిగితే అది ముఖానికిచ్చే వెలుగు సాటిలేనిది. వ్యక్తులకుండే జ్ఞానం వారి ముఖాలకు ప్రత్యేక తేజస్సును చేకూర్చుతుంది. చదువు మనిషి జీవితానికి వెలుగునిస్తుంది. కష్టాలనే చీకటి దారుల్లోంచి ప్రయత్నంతో మనం వెలుగుతోవలు వెతుక్కోవాలి. బయట ఎన్ని వెలుగులున్నా మనిషి మనసు స్వార్థం, అసూయ, చెడుతలంపులతో ఉన్నప్పుడు ఆ మనిషి చీకట్లో ఉన్నట్లే లెక్క. అందుకే మనసులో చీకట్లను తరిమేయాలి. అలాగే నిరాశ అనే చీకటిని పారద్రోలి ఆశాజ్యోతులను వెలిగించుకోవాలి. ఓ కవిగారు 'నీలో దీపం వెలిగించు, నీవే వెలుగై వ్యాపించు' అని ఓ చక్కని గీతం రాశారు. అదెంతైనా అనుసరణీయం. ఆలోచన అల్లికను తుంచుతూ బస్ హారన్. చూస్తే నేను దిగే స్టాప్ వచ్చేస్తోంది. "తమసోమా జ్యోతిర్గమయా!" అనుకుంటూ లేచి, ముందుకు నడిచాను.